క్లుప్తంగా

ఘనంగా మల్లికార్జునస్వామి ఆలయ వార్షికోత్సవం



భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామికి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పులి వాగు వద్ద కొలువైన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయ 21వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా దేవేరులకు, స్వామివారికి ప్రధాన అర్చకులు వీఎస్ఎస్ మూర్తి కల్యాణ క్రతువు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులతోపాటు పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత ప్రాంతాల నుంచి కొత్తూరు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే



పాత పట్టిసీమలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: అంగన్‌వాడీల్లో విద్యను పూర్తిచేసుకున్న విద్యార్థులను ప్రాథమిక పాఠశాలలో చేర్పించడం జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.రాణి తెలిపారు. పోలవరం మండలం పాత పట్టిసీమ గ్రామంలోని నాలుగు అంగన్‌వాడీ సెంటర్ల నుంచి 15 మంది విద్యార్థులను ఎలిమెంటరీ పాఠశాలలో బుధవారం చేర్పించినట్లు ఆమె తెలిపారు. ఐదేళ్ల వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యను అందించి, అనంతరం వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రత్నాజీ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన



ఎల్ఎన్‌డీపేట పీహెచ్‌సీ వద్ద సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం స్థానిక వైద్యశాల వద్ద వైద్యాధికారి కె.నిఖిల్ సికిల్‌సెల్ వ్యాధి లక్షణాలు, వ్యాధి సంక్రమించే విధానం, రోగులు తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి, రక్తహీనతపై కూడా తెలియజేశారు. పీహెచ్‌సీలో పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో జె.ప్రసాద్, సీహెచ్ఎన్ పి.లక్ష్మీదేవి, ఎంపీహెచ్ఎస్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు



ఇసుక రీచ్‌లో సీసీ కెమేరా ఏర్పాటు చేసిన దృశ్యం

కుక్కునూరు: మండలంలోని దాచారం, వింజరం, ఇబ్రహీంపేట గ్రామాల్లోని గోదావరి ఇసుక రీచ్‌ల వద్ద బుధవారం రెవెన్యూ అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అక్రమ మైనింగ్‌పై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గత నెల మండలంలోని ఇసుక రీచ్‌లను పరిశీలించేందుకు వచ్చిన జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అక్రమ ఇసుక రవాణా అరికట్టే దిశగా గోదావరి ఇసుక రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు మండలంలోని వింజరం ఇబ్రహీంపేట ఇసుక రీచ్‌ల వద్ద రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా దాచారం ఇసుక రీచ్ వద్ద ఒక సీసీ కెమెరాను రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ విషయమై కుక్కునూరు తహసీల్దార్ పి.అచ్యుతాకుమారి మాట్లాడుతూ ఇకపై అక్రమ ఇసుక రవాణా జరగకుండా నిరంతర నిఘా ఉంటుందని చెప్పారు. సీసీ కెమెరాలలోని డేటాను ఫోన్ యాప్‌ల ద్వారా లింకప్ చేసి ఎప్పటికప్పుడు ఆ పంచాయతీ వీఆర్వో, తహసీల్దార్ పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. ఎవరైనా అక్రమ మైనింగ్ పాల్పడినట్టు తేలితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్యకర్తలూ.. అధైర్యపడొద్దు

- వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు
- వైఎస్సార్ సీపీ నేతలతో సమీక్ష



వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ కంభం విజయరాజు

చింతలపూడి: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఎవ్వరూ అధైర్య పడవద్దని, ఎల్లవేళలా అందుబాటులో ఉండి అండగా ఉంటానని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు భరోసా ఇచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మండల అధ్యక్షురాలు జగ్గవరపు జానకిరెడ్డి అధ్యక్షతన కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. సమావేశంలో ఎన్నికల్లో పార్టీ ఓటమిపై కార్యకర్తలు, నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ ప్రజలకు మంచి పరిపాలన అందిస్తారని కూటమికి ప్రజలు ఓట్లేసి గెలిపించారని అన్నారు. కానీ ఎన్నికల తరువాత కొన్ని ప్రాంతాల్లో అధికార పార్టీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడటం బాధాకరమన్నారు. ప్రజలు ఓట్లేసి గెలిపించింది మంచి పరిపాలన అందించడానికి తప్ప అధికారాన్ని దుర్వినియోగం చేయడానికి కాదన్నారు. కూటమి పార్టీల వర్గీయులు ఎంత రెచ్చగొట్టినా వైఎస్సార్ సీపీ శ్రేణులు సంయమనం కోల్పోరాదని కోరారు. అందరూ ఐకమత్యంగా ఉండి చట్టపరంగా టీడీపీ దాడులను తిప్పి కొడదామని ధైర్యం చెప్పారు. మళ్లీ మంచి రోజులు వస్తాయని 2029లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. కూటమి పార్టీలు కలిసి ప్రజలను మభ్యపెట్టాయని, ప్రజలు త్వరలోనే అన్నీ తెలుసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. సింగిల్‌గా పోటీ చేసిన వైఎస్సార్ సీపీకి 40 శాతం ఓట్లు వచ్చిన విషయం కార్యకర్తలు మర్చిపోకూడదన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో తనకు అండగా నిలిచిన ప్రతి కార్యకర్తకు, నాయకునికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎన్నికల ముందు నియమించినప్పటికీ ప్రజలు చూపిన ఆదరాభిమానాలు మర్చిపోలేనన్నారు. తనకు ఓట్లు వేసిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని అన్నారు. ఇకపై ప్రజల పక్షాన ఉండి ప్రతి సమస్యపై పోరాటం సాగిద్దామని అన్నారు. ఎవరూ అధైర్య పడవద్దని భవిష్యత్తు మనదేనని భరోసా కల్పించారు. వైఎస్సార్ సీపీకి పోరాటాలు కొత్తకాదని, అధికార పార్టీ లోపాలను ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూ ప్రజలతో కలిసి ముందుకు అడుగులు వేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ డా రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్, వైఎస్సార్ సీపీ నాయకురాలు పొన్నాల అనిత, పార్టీ పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ ఎం రాంబాబు, మాజీ జెడ్పీటీసీ చేపూరి ఖాదర్‌బాబు, పి మాధవ రెడ్డి, బొడ్డు వెంకటేశ్వరరావు, ఎ సుబ్బారావు తదితరులు మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో పార్టీని మరింత బలోపేతం చేసుకుని వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అధికారంలోకి తీసుకువద్దామని చెప్పారు. కార్యక్రమంలో మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

అన్నసమారాధన



అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శ్రీశ్రీశ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ సన్నిధిలో బుధవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్వామివారికి నైవేద్యంగా అన్నవరం ప్రసాదం, రెండు రకాల కూరలు, ఒక చట్నీ, సాంబారు, అన్నం సమర్పించారు. అనంతరం సుమారు 1100 మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారని కమిటీ తెలిపింది.

శ్రీహనుమాన్ శోభాయాత్ర



మద్దిక్షేత్రం నుంచి శోభాయాత్ర ప్రారంభించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేక మహోత్సవం సందర్భంగా శ్రీ హనుమాన్ శోభాయాత్ర బుధవారం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జంగారెడ్డిగూడెం మండలం మద్ది ఆంజనేయస్వామి ఆలయం నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా కొత్తపేట ఆంజనేయ స్వామి గుడి వరకు ఈ బైక్ ర్యాలీ సాగింది. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓలేటి సత్యనారాయణ హనుమాన్ విగ్రహానికి పూజ నిర్వహించి, అనంతరం జెండా ఊపి హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా గారపాటి మాట్లాడుతూ ప్రతి భారతీయుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆదర్శంగా తీసుకొని దేశ, ధర్మ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మద్ది ఆంజనేయస్వామి ఆలయ ఈవో కొండలరావు, ఆర్ఎస్ఎస్ సెక్రటరీ వెంకటస్వామి, దెందులూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ గుమ్మడి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహించరాదు



తపస్య పాఠశాలలో తనిఖీలు నిర్వహిస్తున్న డీవైఈవో రవి ప్రకాష్, మండల విద్యాశాఖ అధికారులు

కామవరపుకోట: పాఠశాల నిర్వహణకు అనుమతులు పొందకుండా అడ్మిషన్లు చేయవద్దని ఏలూరు జిల్లా డీవైఈవో ఏ.రవిప్రకాష్ అన్నారు. పాఠశాల నిర్వహణకు ఏ విధమైన అనుమతులు పొందకుండా స్థానిక చెక్‌పోస్ట్ సమీపంలో నిర్వహిస్తున్న తపస్య పాఠశాలపై ఫిర్యాదులు అందటంతో బుధవారం పాఠశాలలో ఆయన తనిఖీలు నిర్వహించారు. పాఠశాల నిర్వహణకు సరైన సదుపాయాలు లేవని, అడ్మిషన్లు ఆపేయాలని ఆయన అన్నారు. అనుమతులు పొందకుండా అడ్మిషన్ చేసినా, క్లాసులు ప్రారంభించినా చర్యలు తీసుకుంటామని స్కూల్ యాజమాన్యాన్ని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు డి.సుబ్బారావు, సీహెచ్ ప్రశాంత్ కుమార్, సీఆర్పీలు ఆయన వెంట ఉన్నారు.

గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఐటీడీఏ పీఓ సూర్యతేజ



బూసరాజుపల్లి గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ సూర్యతేజ

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ తెలిపారు. ప్రపంచ సికిల్‌సెల్ ఎనీమియా దినోత్సవం సందర్భంగా మండలంలోని బూసరాజుపల్లి గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు రక్తహీనత బారిన పడకుండా సంపూర్ణ పౌష్టికాహారాన్ని ఎప్పటికప్పుడు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు ఎప్పటికప్పుడు రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. గిరిజన ప్రాంతంలో సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి బారిన పడ్డ వారిని గుర్తించి వారికి సకాలంలో వైద్యసేవలు అందించే విధంగా కృషి చేస్తున్నామని చెప్పారు. వారికి అవసరమైన సలహాలు, సూచనలను వైద్యులు అందిస్తున్నారని అన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్ధారణకు సంబంధించిన పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేష్, అధికారులు కె.నీలయ్య, శ్రీవిద్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లపై కవ్వింపు ధోరణి మానుకోవాలి



అంకాలగూడెంలో వైఎస్సార్ విగ్రహానికి ఉన్న ముసుగులను తొలగించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

కొయ్యలగూడెం: వలంటీర్ల విషయంలో కూటమి ప్రభుత్వం కవ్వింపు ధోరణితో వ్యవహరిస్తుందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం నాయకులు ఆరోపించారు. అంకాలగూడెంలో ఎన్నికల కోడ్ కారణంగా మహానేత వైఎస్సార్ విగ్రహంపై వేసిన ముసుగును బుధవారం తొలగించి జలాభిషేకం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ వలంటీర్లను కేసులు పెట్టాల్సిందిగా ఉసిగొల్పుతుండడం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. వలంటీర్ల వ్యవస్థపై ఆవిర్భవించిన నాటినుంచి అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న జనసేన, టీడీపీ నాయకులు, వారి పట్ల ఎప్పుడూ కూడా సానుకూలంగా స్పందించలేదని అన్నారు. ఏదో ఒక విధంగా వలంటీర్లను తొలగించే ఆలోచనతో వారి వ్యవహార శైలి ఉన్నట్లు కనబడుతుందని అన్నారు. వలంటీర్లకు న్యాయం చేసే విధంగా తమ పోరాటం కొనసాగుతుందన్నారు. దూలపల్లి కాంతారావు, ఏలేటి చంద్రం, చిడిపి రవి, సర్పంచ్ కడకట్ల గడ్డియ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు బైక్‌లు ఇవ్వకండి

తల్లిదండ్రులకు సూచించిన భీమడోలు సీఐ



ద్వారకాతిరుమలలో మీడియాతో మాట్లాడుతున్న భీమడోలు సీఐ భీమేశ్వర రవికుమార్

ద్వారకాతిరుమల: మైనర్ బాలలకు బైక్‌లు ఇచ్చి ప్రమాదాలకు కారకులు కావొద్దని భీమడోలు సీఐ బి.భీమేశ్వర రవికుమార్ తల్లిదండ్రులకు సూచించారు. ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్సై జి.సతీష్‌తో కలసి ఆయన మాట్లాడారు. పిల్లలు పదోతరగతి పాసయ్యారన్న ఆనందంతో కొందరు తల్లిదండ్రులు వారికి బైక్‌లు గిఫ్ట్‌గా ఇవ్వడం వంటివి చేస్తున్నారన్నారు. అలాగే మరి కొందరు బాధ్యతారాహిత్యంగా బైక్‌లు ఇచ్చి రోడ్లపై విడిచిపెడుతున్నారని, దీని వల్ల రోడ్డు ప్రమాదాలు కోకొల్లలుగా జరుగుతున్నాయన్నారు. ప్రమాదంలో పిల్లలు ప్రాణాలు కోల్పోయిన తరువాత తల్లిదండ్రులు ఎంత బాధపడినా ప్రయోజనం ఉండదన్నారు. ప్రస్తుతం రోడ్లపై ఎక్కువగా మైనర్లే వాహనాలు నడుపుతూ కనిపిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు. నెంబర్ ప్లేట్లు లేని బైక్‌లు నడిపేవారు నేర స్వభావం కలవారని అన్నారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఎంతో మంది యువత గంజాయి వంటి మత్తు మందులకు బానిసలయ్యి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, తల్లిదండ్రుల పర్యవేక్షణా లోపమే ఇందుకు ప్రధాన కారణమన్నారు. ఇదిలా ఉంటే మండలంలోని పంగిడిగూడెంలో మంగళవారం జరిగిన ఒక కొట్లాటకు సంబంధించి నలుగురిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

గోదావరి మీదుగా పశువుల తరలింపు



మూగజీవాలను వాహనంలో తరలిస్తున్న దృశ్యం

కుక్కునూరు: గతంలో గోదావరి మీదుగా గోవుల అక్రమ రవాణా సాగేది. కానీ తాజాగా బుధవారం పదుల సంఖ్యలో గేదెలను గోదావరి దాటించి తీసుకువెళ్లడం మండలంలో చర్చనీయాంశం అయ్యింది. కొందరు మండలంలోని ఇబ్రహీంపేట గోదావరి రేవు వద్ద గోదావరి నదిని దాటించి గేదెలను అక్కడ నుంచి వాహనాలలో రోడ్డు మార్గం ద్వారా తరలించుకుని వెళుతున్నారు. అక్రమంగా తరలించుకుని వెళుతున్నారా లేదా ఎవరి వద్దనైనా కొనుక్కుని తీసుకువెళుతున్నారా అనే విషయం తేలాల్సి ఉంది. కాగా అక్రమ తరలింపు కాకపోతే గుట్టుచప్పుడు కాకుండా గోదావరి నదిని దాటించి తీసుకువెళ్లాల్సిన అవసరం ఏంటి అని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికీ గోదావరి నది మీదుగా మూగజీవాల తరలింపుపై దృష్టి పెట్టి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలని వినతి

కుక్కునూరు: నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ రాసిన లేఖను విడుదల చేసినట్లు సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి తెలిపారు. ఈ విషయమై ఆయన బుధవారం మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టులో కీలకమైన నిర్వాసితుల పునరావాస ప్యాకేజీ రూ.33 వేల కోట్లు నిధులు మంజూరు చేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని, ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో సర్వస్వం కోల్పోతున్న గిరిజన, దళిత, బడుగు బలహీన వర్గాలకు చెందిన నిర్వాసితులకు న్యాయమైన పునరావాస ప్యాకేజీ అందించేలా చర్యలు తీసుకోవాలని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీ ఇవ్వాలని, తెలంగాణ నుంచి ఆంధ్రాలో విలీనమైన ఏడు మండలాల నిర్వాసితులు సర్వస్వం ప్రాజెక్టు నిర్మాణం కోసం కోల్పోతున్నారని, కావున వారికి మెరుగైన ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలని లేఖలో పేర్కొన్నట్లు వెంకటాచారి తెలిపారు.

దడ పుట్టిస్తున్న కూరగాయల ధరలు



కొయ్యలగూడెం సంత మార్కెట్లో ఏర్పాటుచేసిన కూరగాయల దుకాణాలు

కొయ్యలగూడెం: కూరగాయల రేట్లు సామాన్యులకు కేక పుట్టిస్తున్నాయి. ఏం కొనేట్టులేదు.. ఏం తినేటట్టు లేదు అనుకునేలా ధరలు ఉండడంతో ప్రజలు బెంబేలు చెందుతున్నారు. సాధారణంగా వారపు సంతలో కూరగాయలు నాణ్యమైనవి రావడంతో పాటు ధరలు సరసమైన ధరలకు వస్తాయని సాధారణ, మధ్యతరగతి, పేద ప్రజలు భావించి కొనుగోలు చేయడానికి వస్తుంటారు. అయితే ధరలను చూసి కొనుగోలుదారులు వాపోతున్నారు. కేజీ మిర్చి రూ.100, బీరకాయలు రూ.80, బంగాళదుంపలు రూ. 60, ఉల్లి రూ.50 ఇలా కూరగాయల ధరలు అన్నీ కూడా కొండెక్కడంతో ఎప్పుడు దిగి వస్తాయా అని ఎదురుచూస్తున్నారు. వర్షాభావ పరిస్థితులే కూరగాయల ధరలు పెరగడానికి కారణం అని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వివాహిత ఫిర్యాదు మేరకు అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. జంగారెడ్డిగూడెం రాజీవ్ నగర్‌కు చెందిన వసంతాటి వెంకటేశ్వరరావు, విజయశాంతిలకు 2005లో వివాహమైంది. వీరికి ఒక కుమార్తె. ఇటీవల అధిక కట్నం కోసం తనను తన భర్త వెంకటేశ్వరరావు శారీరికంగా, మానసికంగా వేధిస్తున్నాడని, దీనికి అతని కుటుంబసభ్యులు సహకరిస్తున్నారని బాధితురాలు విజయశాంతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

ఉపాధి హామీ పనులు నిలిపివేయడం తగదు

ఏలూరు (టూటౌన్): దెందులూరు, పెదవేగి మండలాల్లో ఉపాధి హామీ పనులు నిలిపివేయడం తగదని, దీంతో ఉపాధి కూలీలు నానా అవస్థలు పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ జిల్లా డ్వామా అధికారులపై మండిపడ్డారు. బుధవారం జిల్లా డ్వామా ఆఫీసు కార్యాలయంలో ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం తపాలాలో అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధి కూలీల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి వెళితే కనీసం పట్టించుకుని సమస్యను పరిష్కారం చూపేందుకు అధికారులు కరువయ్యారన్నారు. అలాగే జీలుగుమిల్లి మండలంలో ఏపీఓపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పి.అంకపాలెం, దర్బగూడెంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోయినా, పనిచేయకపోయినా వారి పేర్లతో జీతాలు డ్రా చేసుకొని అక్రమంగా చట్ట వ్యతిరేకంగా ఉపాధి నిధులు స్వాహా చేస్తున్నారని, దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు.

ఫైర్ మాక్‌డ్రిల్



జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో ఫైర్ మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక అధికారులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో బుధవారం జంగారెడ్డిగూడెం అగ్నిమాపక అధికారులు ఫైర్ మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఆసుపత్రిలో ఫైర్ ఫైటింగ్, ఫైర్ మాక్‌డ్రిల్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాల్సిన విధానాలను అగ్నిమాపక అధికారులు వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది హెచ్‌సీ ఎం.శ్రీనివాస్, ఎస్.సత్యనారాయణ, డి.బాలాజీ నాయక్, కానిస్టేబుల్ బాలాజీ, రాజు, లక్ష్మణ్‌రావ్, ఆసుపత్రి సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వి.రాంబాబు, ఆసుపత్రి వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలు



జంగారెడ్డిగూడెంలో రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జంగారెడ్డిగూడెం: దేశ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు బుధవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కాంగ్రెస్ ఏపీ ప్రధాన కార్యదర్శి గౌతు సత్యేంద్రబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా, యువతకు ఉద్యోగ అవకాశాలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జాలిపూడిలో పారిశుద్ధ్య పనులు చేయాలి

ఏలూరు రూరల్: జాలిపూడి ఎస్సీ కాలనీలో తక్షణం పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎస్సీ కాలనీ పెద్ద సీరియల్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా ఎస్సీ కాలనీ పరిసరాల్లో పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య పనులు చేయడం లేదన్నారు. కాలనీలో మురుగునీరు, చెత్త చెదారంతో దుర్గంధం వెదజల్లుతోందన్నారు. ఇదేమని సిబ్బందిని ప్రశ్నిస్తే గ్రామ టీడీపీ నాయకులు ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టవద్దన్నారని చెప్పారన్నారు. కొందరు టీడీపీ నాయకులు పంచాయతీ పాలన వ్యవహారాలు పరివేక్షిస్తూ వైఎస్సార్‌సీపీకి ఓటు వేశారనే నెపంతో ఎస్సీలు నివసిస్తున్న ప్రాంతాలను పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు.